క్లుప్తంగా

జాతిపితను విస్మరించిన నేతలు, అధికారులు



గన్నవరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న మహాత్ముని విగ్రహాన్ని ఆయన జయంతి రోజు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు విస్మరించారు. ఉదయం 11.30 గంటల వరకు సదరు విగ్రహానికి దండ వేసిన వారే కరువయ్యారు. చివరికి జర్నలిస్టులు మహాత్మునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొద్ది సేపటికి సీఐ బీవీ శివప్రసాద్, ఎస్‌ఐలు వచ్చి గాంధీజీ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. పట్టణంలో ఉన్న ఏకైక మహాత్ముని విగ్రహం వద్ద నేతలు, ప్రజాప్రతినిధులు ఎవరూ నివాళులర్పించేందుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

డీఎస్సీకి ఎంపికైన కానిస్టేబుల్‌కు సత్కారం



గన్నవరం: సెకండ్ గ్రేడ్ టీచర్‌గా ఎంపికైన కానిస్టేబుల్ ఎస్. సుబ్రహ్మణ్యంను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం సత్కరించారు. సుబ్రహ్మణ్యం దంపతులను సీఐ బీవీ శివప్రసాద్, ఎస్‌ఐలు దుశ్శాలువాలు కప్పి అభినందించారు. సీఐ మాట్లాడుతూ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పట్టుదలతో చదివి టీచర్‌గా ఎంపికవడం ప్రశంసనీయమన్నారు. సమాజంలో అతి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలోనూ సుబ్రహ్మణ్యం మంచి గుర్తింపును సాధించాలని ఆకాంక్షించారు. ఎస్‌ఐలు కె. శ్రీధర్, పరిమి కిషోర్, క్రైం ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే రోజు 50 కార్లు డెలివరీ



రామవరప్పాడు: దసరా ఉత్సవాలు, జీఎస్టీ తగ్గింపుతో రామవరప్పాడులోని సాయి స్వర్ణ హ్యుందాయ్ షోరూమ్‌లో ఒకే రోజు 50 కార్లు డెలివరీ ఇచ్చినట్లు షోరూమ్ జనరల్ మేనేజర్ భగత్ సింగ్ తెలిపారు. రామవరప్పాడులోని షోరూమ్‌లో శుక్రవారం పలు కార్లను డెలివరీ చేశారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ మాట్లాడుతూ క్రెటా, వెన్యూ, ఎక్స్‌టర్ వంటి ఎస్‌యూవీ కార్లు గత నెలలో అత్యధిక అమ్మకాలను సాధించాయన్నారు. పండుగ సీజన్, జీఎస్టీ తగ్గింపుతో భారీ ఆఫర్లు ప్రకటించినట్లు వివరించారు. ఈ నెలలో కూడా పలు కార్లు డెలివరీలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

తాడిగడపకు స్వచ్ఛాంధ్ర అవార్డులు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ, పెనమలూరు మండలంలో పలు కార్యాలయాలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు లభించాయి. తాడిగడప కమిషనర్ ఎస్.కె.నజీర్ శుక్రవారం వివరాలు తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీకి ఉత్తమ స్వచ్ఛాంధ్ర మున్సిపాలిటీగా అవార్డు వచ్చిందన్నారు. అదే విధంగా పెనమలూరు ఎంపీడీవో కార్యాలయం, యనమలకుదురు అర్బన్ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ), పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉత్తమ అవార్డులు ప్రకటించారని తెలిపారు. స్వచ్ఛ వారియర్‌గా యనమలకుదురు సచివాలయంలో పని చేస్తున్న బత్తుల రమణకు అవార్డు వచ్చిందని పేర్కొన్నారు.



కంకిపాడులో శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు



రాజరాజేశ్వరీ దేవిగా పేరంటాలమ్మ



ఉయ్యూరులో రాజరాజేశ్వరీ దేవిగా ..



యనమలకుదురులో రజితకవచ అలంకరణలో శ్రీపార్వతీదేవి



నున్నలో రాజరాజేశ్వరిదేవిగా కామాక్షి అమ్మవారు

కరుణించమ్మా.. కాపాడమ్మా..

- వైభవంగా ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- విజయ దశమి రోజు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

కంకిపాడు: దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. పదకొండురోజులు పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. చివరి రోజైన గురువారం దశమి సందర్భంగా అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు, మద్దూరు గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కంకిపాడులో కోయ నృత్యాలు, ప్రత్యేక డప్పు వాయిద్యాలు అలరించాయి. ఉప్పలూరు, మంతెన, ఈడుపుగల్లు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ, ఎస్‌ఐ సందీప్‌లు ఉప్పలూరులో ఏర్పాటుచేసిన భవానీ మందిరాన్ని సందర్శించి పూజలు చేశారు.

రాజరాజేశ్వరీ దేవిగా పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ గురువారం శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు.



ఉప్పలూరులో అమ్మవారిని దర్శించుకున్న సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సందీప్

సాయంత్రం శమీ పూజ నిర్వహించారు. పూజలో భాగంగా శ్రీ రామలింగేశ్వరస్వామి పూజా కైంకర్యాలు నిర్వహించి అనంతరం స్వామివారికి పవళింపు సేవ చేశారు. దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతం చేయడానికి సహకరించిన భక్తులకు ఆలయ ఈఓ పి. ప్రియాంక కృతజ్ఞతలు తెలిపారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణం, ఉయ్యూరు మండలంలోని గ్రామాల్లో నవరాత్రులు ఘనంగా ముగిశాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఊరేగింపు మహోత్సవాలు కనులపండువగా సాగాయి.

అలరించిన కోలాట ప్రదర్శన

గన్నవరం: స్థానిక సొసైటీపేటలోని శ్రీగాయత్రి మందిరంలో గురువారం అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిదేవిగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం చిన్నారుల కోలాట ప్రదర్శన అలరించింది. బుద్దవరంలో దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య సౌజన్యంతో భక్తులకు అన్నసమారాధన చేశారు. స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం, దావాజీగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, యాదవుల రామాలయం, కనకదుర్గమ్మ ఆలయం, శ్రీవాసవీ మాత మందిరం, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శమీపూజ జరిపారు.



గన్నవరంలో చిన్నారుల కోలాట ప్రదర్శన

పెనమలూరు: యనమలకుదురు శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం శ్రీపార్వతీదేవి అమ్మవారిని రజతకవచ అలంకరణ చేశారు. అమ్మవారికి చండీహోమం, కుంకుమ పూజలు చేశారు. లాకు సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో, పోరంకి గంగానమ్మ గుడి వద్ద, పెనమలూరులోని శ్రీసీతారామాలయంలో, చోడవరం శ్రీనాగేంద్రస్వామి, పెదపులిపాక శ్రీ విజయరాజరాజేశ్వరి, పెనమలూరు చిన్నగుడిలో నవరాత్రులు వైభవంగా ముగిశాయి.

నున్న(విజయవాడరూరల్): నున్నలోని చినకంచి చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి ఆలయంలో గురువారం శ్రీకామాక్షి అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బోడపాడు రామాలయం, చెరువు సెంటర్‌లో శ్రీకనకదుర్గమ్మ ఆలయం, పి.నైనవరం గ్రామంలోని శివనాగేంద్రస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా పూజలు అందుకున్నారు.

జీఎస్టీ 2.0పై రైతులకు అవగాహన

పెనమలూరు: జీఎస్టీ 2.0లో వ్యవసాయ యంత్రాలపై ధరలు తగ్గాయని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ తెలిపారు. పోరంకి గ్రామంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యాక్రమంలో భాగంగా జీఎస్టీపై అవగాహనపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ శైలజ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గిందన్నారు. రైతులు తగ్గిన వ్యవసాయ యంత్రాల వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కాగా శనివారం ఉయ్యూరు నుంచి గండిగుంట వరకు జీఎస్టీపై ర్యాలీ ఉన్నందున రైతులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో రైతులకు మేలు

గన్నవరం రూరల్: జీఎస్టీ సంస్కరణలు వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేస్తాయని పెనమలూరు సర్కిల్ వాణిజ్య పన్నుల శాఖ సీటీఓ పి.లక్ష్మీమాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని పురుషోత్తపట్నంలో రైతులతో ఆమె మాట్లాడారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని వివరించారు. డీసీపీవో బి.కిరణ్‌కుమార్, ఎంపీడీవో స్వర్ణలత, కార్యదర్శి ప్రసాద్, ఈవోపీఆర్డీ భారతి, ఎంఏవో శివప్రసాద్, వీఏఏ సాగర్, రైతులు పాల్గొన్నారు.

అన్నసమారాధన ప్రారంభం

కంకిపాడు: మంతెన గ్రామంలో శుక్రవారం నుంచి సద్ది (అన్నసమారాధన) కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన శ్రీ రామ భక్త అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబరు 15వ తేదీ వరకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. తొలిరోజు కార్యక్రమాన్ని గురుస్వాములు చిమటా ప్రసాద్, తాతా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్ ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమాన్ని గురుస్వాములు, సంఘ ప్రతినిధులు మాదు సుబ్రహ్మణ్యం, వీర్ల శ్రీనివాస రోష్‌కుమార్, వీరంకి నాగేశ్వరరావు, చిమటా బాబీ, కొండవీటి వెంకట సుబ్బారావు పర్యవేక్షించారు.

ఏటిపాయలో తగ్గిన వరద ఉధృతి

- పంట పొలాలను వదలని వరదనీరు
- ఆందోళనలో రైతులు

కంకిపాడు: ఏటిపాయలో స్వల్పంగా వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. కరకట్ట దిగువ వరకు వచ్చిన వరదనీరు ప్రస్తుతం ఏటిపాయ అంచులు తాకుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి ఆరు లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేయడంతో ఏటిపాయ స్థిరంగా సాగుతోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం వద్ద ఏటిపాయ అంచులు మీదుగా వరద ప్రవహిస్తోంది.

పంట పొలాల్లోనే వరదనీరు

ఉధృతి తగ్గినా పంట పొలాల్లోకి చేరిన వరదనీరు పొలాలను వీడటం లేదు. దీంతో మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల పరిధిలో కంద, పసుపు, మిరప, కూరగాయల తోటలు కుళ్లుతున్నాయి. పొలాల్లో నిలిచిన వరదనీటిని పక్కనే ఉన్న పంట బోదెల్లోకి మళ్లించేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. పంటను కాపాడుకోడానికి నానా తంటాలు పడుతున్నారు. పంటలు కుళ్లబారిన పడటంతో పెట్టిన పెట్టుబడులు ఎక్కడ చేతికి దక్కకుండా పోతాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రత్యేకించి పసుపు, కంద పంటలకు దుంప కుళ్లుడు సోకితే పంట నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బతింటాయని వాపోతున్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టం అంచనాలు, పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.



కాసరనేనివారిపాలెం వద్ద కుళ్లుతున్న కంద తోట



మద్దూరు వద్ద తగ్గిన నీటి మట్టం

పడవలపై ప్రయాణం

కొద్దినెలలుగా ఇక్కడి రైతులు, కూలీలు పడవలపైనా ఆధారపడి లంక భూముల్లోకి వెళ్తున్నారు. ఏటిపాయలోని లంక భూముల్లోకి వెళ్లేందుకు ఉన్న రోడ్డు వరద ఉధృతి కారణంగా ధ్వంసమైంది. దీనికి తోడు రెండు నెలలుగా కనీసం రాకపోకలకు కూడా ఆస్కారం లేని విధంగా వరద తరచూ వచ్చిపడుతోంది. దీంతో ఏటిపాయలోని లంక భూముల్లో పనులు, పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు రైతులు పడవలను ఆశ్రయిస్తున్నారు.

స్ఫూర్తి ప్రదాత మహాత్మా గాంధీ

మహాత్మునికి ఘన నివాళి

పెనమలూరు: దేశ స్వాతంత్ర కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన మహాత్మాగాంధీ స్ఫూర్తి ప్రదాత అని, గాంధీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్ కాశిం పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం యనమలకుదురు శేషమాంబ ఆశ్రమం వద్ద మహాత్మా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు కోసూరి నరేష్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. అలాగే కానూరులోని అశోక్ జిమ్‌లో బాడీ బిల్డింగ్ క్రీడాకారులు మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

రామవరప్పాడు: గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ పితృదేవోభవ రామవరప్పాడు క్లబ్ ఆధ్వర్యాన ఇంద్రకీలాద్రికి కాలినడకన వచ్చే భవానీ దీక్షాపరులకు అల్పాహారం పంపిణీ చేశారు. తొలుత ప్రసాదంపాడులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వుడత్తు నరేంద్ర, కోట మల్లికార్జునరావు, వుడత్తు ఆంజనేయులు, పద్మనాభుని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో గాంధీకి నివాళులు



ప్రసాదంపాడులో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విలువలు కలిగిన రాజకీయవేత్తగా దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు పైడి సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంగణంలో ఆయన విరాళంతో ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు కొనసాగిన అజాతశత్రువు రోశయ్య అని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు తవ్వా పూర్ణచంద్రరావు, బొమ్మశెట్టి రామారావు, కపిలవాయి భగవతి, తవ్వా కుటుంబరావు పాల్గొన్నారు.



మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణలో ఆర్యవైశ్య సంఘం నాయకులు

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ

కంకిపాడు: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం గోసాల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి కంకిపాడులోని పావన్ గాయత్రి ధ్యాన మందిరంలో ఉచిత యోగ శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు యోగాచార్యులు నేరెళ్ల తులసీకృష్ణ, కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీనియర్ కమ్యూనిస్టు వెంకటరత్నం మృతి

గన్నవరం రూరల్: సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు పాలడుగు వెంకటరత్నం(74) గురువారం మృతిచెందారు. మండలంలోని సావరగూడెం గ్రామానికి చెందిన ఆయన ఆరు దశాబ్దాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తూ సామాజిక న్యాయం, హక్కుల కోసం పోరాడారు. శుక్రవారం గ్రామంలో ఆయన అంతిమయాత్ర నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు, పలు రాజకీయ పార్టీల నాయకులు వెంకటరత్నంకు నివాళులర్పించారు.

నున్నలో గ్రామ సభ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గురువారం గ్రామసభ జరిగింది. గాంధీజయంతి సందర్భంగా జరిగిన ఈ సభలో గ్రామంలో నిర్మించే రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణల తొలగింపునకు తీర్మానం చేశారు. గ్రామసభలో ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పలువురు వార్డు సభ్యులు, గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత మహాత్మగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆదర్శ భావాలను పెంపొందించుకోవాలి



ఉయ్యూరులో ఎన్‌సీసీ బృందం

ఉయ్యూరు: విద్యార్థులు ఆదర్శ భావాలను పెంపొందించుకోవాలని ఎన్‌సీసీ మచిలీపట్నం 16(ఎ) బెటాలియన్ అడ్మిన్‌స్ట్రేషన్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ కన్నన్ సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా ఉయ్యూరు విశ్వశాంతి విద్యాసంస్థల్లో స్వచ్ఛతా సేవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత దేశభక్తి భావం, జాతీయ సమైక్యత, ఐక్యత, అభివృద్ధి, క్రమశిక్షణ, దేశ రక్షణ అంశాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కె.పద్మజావాణి, ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జయదేవ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





దసరా ఉత్సవాలు ముగిసినా భవానీ భక్తుల రాకతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. దుర్గమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన వేలాది మంది భవానీలతో క్యూలైన్లు రద్దీగా మారాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భవానీలు తరలివచ్చారు. కనకదుర్గమ్మా.. కాపాడు తల్లి అంటూ భవానీలు అమ్మవారిని స్మరించుకున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భవానీ మాతాకు జై..



